## రేపటినుంచి ధాన్యం సేకరణ

● క్వింటాల్ రూ.2,545

అడయార్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 1న సోమవారం నుంచి ధాన్యం సేకరణ ప్రారంభం కానుంది. ఇందులోభాగంగా క్వింటాల్ ధాన్యం ధరను రూ.2,545గా నిర్ణయించినట్టు ప్రభుత్వం విడుదల ప్రకటనలో పేర్కొంది. 2025-26 సంవత్సరానికి కేంద్రప్రభుత్వం ధాన్య సేకరణ ధరను నిర్ణయించింది. కేంద్రం ఇచ్చే ధర కంటే రైతులకు అదనపు ధర చెల్లించే విధానం దివంగత డాక్టర్ కలైంజర్ హయాం నుంచే అమల్లో ఉంది. కలైంజర్ అడుగుజాడల్లో నడుస్తున్న డీఎంకే ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్య సేకరణ ధరను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నిర్ణయించారు. ఇందులోభాగంగా క్వింటాల్ ధాన్యం ధర రూ.2,389 నుంచి రూ.2,545గా పెంచినట్టు ప్రభుత్వం తెలిపింది. సాధారణ రకం ధాన్య సేకరణ ధరను రూ.2,369 నుంచి రూ.2500కు పెంచారు. ఈ పెంచిన ధరతోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సేకరణ కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తారని ప్రభుత్వం పేర్కొంది.

## ఆన్‌లైన్‌లో వాహనాల ఫ్యాన్సీ నెంబర్ల వేలం

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వాహనాల ఫ్యాన్సీ నెంబర్లు వేలం ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రంలో ద్విచక్రవాహనాలు, కార్లు, వ్యాన్, జీపు, లారీ తదితర వాహనాలకు నిర్ణీత నెంబరు పొందేందుకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆన్‌లైన్ వేలం ద్వారా వాహనాలకు ఫ్యాన్సీ నెంబర్లు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లోకి తెచ్చింది. ఇందుకోసం మోటరు వాహనాల చట్టాన్ని సవరించిన రాష్ట్ర ప్రభుత్వం, కొత్త ముసాయిదా నిబంధనలను జారీచేసింది. అవసరమైన వ్యక్తులకు 'ఈ-బిడ్డింగ్' ద్వారా వేలం నిర్వహిస్తారు. ఈ విధానంతో ఫ్యాన్సీ నెంబర్లు పొందడం సులభతరం కాగా, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది.

**కొత్త నిబంధనలు....**

- ఫ్యాన్సీ నెంబర్లు పొందేందుకు నిర్ణయించిన రుసుము మార్చనున్నారు. ప్రస్తుతం అధిక బిడ్డింగ్ వేసిన వారికి ఫ్యాన్సీ నెంబరు లభిస్తుంది.
- ప్రవేశ రుసుము రూ.1,000 నుంచి రూ.2,000 పెంచారు.
- https://fancy.parivahan.gov.inలో అప్లై చేసుకుని ఫ్యాన్సీ నెంబరు ఎంపిక చేసుకోవాలి.
- వేలంలో నెంబరు పొందిన వారు 48 గంటల్లో నగదు చెల్లించాలి.
- 30 రోజుల్లోపు వాహనాన్ని ఆర్టీఓ కార్యాలయానికి తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ చేయని పక్షంలో, ఆ నెంబరు రద్దు చేసి, మళ్లీ వేలం నిర్వహిస్తారు. ఈ కొత్త విధానం ఈ నెల 18వ తేది నుంచి అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

## కోర్టు సమయం వృథా చేస్తే రూ.లక్ష జరిమానా

● మద్రాసు హైకోర్టు

అడయార్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు సమయాన్ని వృథా చేసే ప్రజా ప్రయోజన వ్యాజ్యాలకు సంబంధించి పిటిషన్‌దారులకు రూ.లక్ష జరిమానా విధిస్తామని మద్రాసు హైకోర్టు హెచ్చరించింది. తిరువళ్లూర్ కోలప్పన్ వీధిలో నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారంటూ మద్రాసు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం, పిటిషన్‌దారుడు ఆరోపణలకు తగిన ఆధారాలు లేవంటూ తోసిపుచ్చింది. అదే సమయంలో, కోర్టు సమయాన్ని వృథా చేసేలా దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసే పిటిషన్‌దారులకు రూ.లక్ష జరిమానా విధిస్తామని న్యాయస్థానం హెచ్చరించింది. సరైన ఆధారాలు పరిశీలించిన తర్వాతే వ్యాజ్యం దాఖలు చేయాలని న్యాయస్థానం సూచించింది.

## పదవీ విరమణ రోజున 'నో సస్పెన్షన్'

● జీవో విడుదల చేసిన ప్రభుత్వం

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ రోజున ఉద్యోగుల సస్పెన్షన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. ఆ మేరకు నిబంధనలు సవరిస్తూ జీవో విడుదల చేసింది. వివిధ కారణాలతో పదవీ విరమణ రోజున సస్పెన్షన్ చేసే చర్యలను విరమించుకోవాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పలుమార్లు విజ్ఞప్తి చేసుకున్నారు. వారి వినతి పట్ల సానుకూలంగా స్పందించిన సీఎం.. 2021లోనే సస్పెన్షకు ఫుల్‌స్టాప్ పెడతామని ప్రకటించారు. ఆ మేరకు శాసనసభ సమావేశాల్లో 110వ నిబంధన కింద ప్రకటన కూడా చేశారు. ఇప్పటివరకు లంచం తీసుకోవడం, అవినీతి, అవకతవకలకు పాల్పడే ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలు నిరూపితమైతే, శాఖాపరమైన విచారణ చేపట్టి వారిపై చర్యలు చేపట్టే ప్రక్రియ కొనసాగుతోంది. విచారణ దీర్ఘకాలంగా సాగుతున్న కారణంగా, శాఖాపరమైన చర్యల కింద వారిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నారు. ఈ కారణంగా పదవీ విరమణ పొందుతున్న వారు పింఛన్, నగదు ప్రయోజనాలు పొందలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనిని గమనించిన ప్రభుత్వం నిబంధనల్లో మార్పులు చేపట్టింది. పదవీ విరమణ పొందిన రోజు ప్రభుత్వ ఉద్యోగులపై సస్పెండ్ ఉండదని తెలిపింది. ఉద్యోగులపై వచ్చే ఆరోపణలను సకాలంలో విచారించడంతో పాటు పదవీ విరమణ పొందనున్న మూడు నెలలకు ముందుగానే శాఖాపరమైన చర్యలు చేపట్టేలా సవరించింది. ఈ చర్యలు కూడా ఆలస్యమైతే, ఆ జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులను నిర్ణీత రోజునే పదవీ విరమణ చేసేందుకు అనుమతించాల్సి ఉంటుంది. పదవీ విరమణ చేసినా, విచారణ పూర్తయిన తరువాతే వారికి అందాల్సిన పింఛన్, ఇతర నగదు ప్రయోజనాలు అందుతాయి. ఈ మార్గదర్శకాలు అవినీతి నిరోధక శాఖ విచారణ, క్రిమినల్ కేసులకు వర్తించవని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది.




7లో...

# యువ ఓటర్లు డీఎంకే వైపే

## విమానాశ్రయంలో స్టాలిన్ ఉద్ఘాటన

విదేశీ పర్యటనకు వెళ్లిన సీఎం ● పెట్టుబడుల సేకరణే లక్ష్యంగా టూర్



సీఎంతో డీఎంకే నేతలు

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్ని కొత్త రాజకీయ పార్టీలు వచ్చినప్పటికీ యువ ఓటర్లు డీఎంకే వైపునే నిలబడ్డారని ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఆయన జర్మనీ, బ్రిటన్ దేశాల పర్యటనకు శనివారం ఉదయం 8.30 గంటలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ఎయిర్‌పోర్టులో విలేకరులతో మాట్లాడుతూ.. పెట్టుబడుల నిమిత్తం బ్రిటన్, జర్మనీ దేశాల పర్యటనకు వెళుతున్నానని, సెప్టెంబరు 8న రాష్ట్రానికి తిరిగి వస్తానని తెలిపారు. ఈ పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం, కొత్తపరిశ్రమల ఏర్పాటుపై అవగాహనఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకుంటానన్నారు. 2021లో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రూ.10.62 లక్షల కోట్ల పెట్టుబడులను స్వీకరించడంతో పాటు 922అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నామన్నారు.తద్వారా రాష్ట్రంలో 32,81,032 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్టు గుర్తు చేశారు. ఈ ఒప్పందాల మేరకు అనేక కంపెనీ స్థాపన పనులు పూర్తికాగా, మరికొన్ని ఉత్పత్తులను కూడా ప్రారంభించాయన్నారు.

**కేంద్రప్రభుత్వ గణాంకాలు...**

రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నించే వారికి కేంద్ర ప్రభుత్వ గణాంకాలే నిదర్శనమన్నారు. తన ప్రతి ఒక్క విదేశీ పర్యటనలో తమ రాష్ట్రం శాంతివనంగా ఉందని, ఎంతో మంది నైపుణ్యంతో కూడిన యువత అందుబాటులో ఉందన్నారు. అనేక ఉపాధి అవకాశాలు కల్పించే రాష్ట్రంగా ఉందని తెలియజేస్తూ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జపాన్, సింగపూర్, స్పెయిన్, అమెరికా దేశాల్లో తాను పర్యటించానని తెలిపారు. అమెరికా పర్యటనలో 19 అవగాహన ఒప్పందాలు, స్పెయిన్‌లో 3, జపాన్‌లో 7, యూఏఈ 6, సింగపూర్‌లో ఒకటి చొప్పున కుదుర్చుకున్నట్టు తెలిపారు. ఈ 36 ఒప్పందాల్లో 23 పథకాలు ఇప్పటికే వివిధ దశల్లో అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇపుడు జర్మనీ, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళుతున్నాని, ఈ పర్యటనలో కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆయా దేశాల పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నట్టు వెల్లడించారు. తన పర్యటనలో ప్రధానంగా సెప్టెంబరు 4న ఆక్స్‌ఫర్డ్ వర్శిటీలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటానని వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ పార్టీలు వచ్చినా, యువ ఓటర్లు మాత్రం డీఎంకేవైపే నిలబడ్డారన్నారు. బీహార్ రాష్ట్రానికి ఇటీవల తాను వెళ్లి వచ్చానని, అక్కడ కేంద్ర ఎన్నికల సంఘం ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా వారు అనుకున్నది సాధించలేరన్నారు. ఎందుకంటే బీహార్ రాష్ట్ర వాసులు ఎంతో చైతన్యవంతులుగా ఉన్నారన్నారు. అదేసమయంలో ఈసీ పన్నాగాలు మన రాష్ట్రంలో సాగబోవన్నారు. ఎన్నికలకు ముందు ఎన్ని ప్రీపోల్ సర్వేలు జరిపినా వచ్చే ఎన్నికల్లో డీఎంకే ఘన విజయం సాధించి మళ్ళీ అధికారంలోకి రాబోతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సినీ హీరో విజయ్ రాజకీయ ప్రవేశంపై తన అభిప్రాయాన్ని తెలియజేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రత్యర్థులు చేసే ఆరోపణలు సమాధానాలు ఇవ్వకుండా చేతల్లో చేసి చూపించడమే తన నైజమన్నారు. అందుకే తాను ఎక్కువగా మాట్లాడనని స్టాలిన్ అన్నారు. కాగా, సీఎం విదేశీ పర్యటనలో ఆయన సతీమణి దుర్గాస్టాలిన్, సీఎం సెక్రటరీ ఉమానాథ్, ఇంటెలిజెన్స్ ఐజీ సెంథిల్‌వేలవన్ తదితర ఉన్నతాధికారులు ఉన్నారు. వారికి రాష్ట్ర మంత్రులు, డీఎంకే ఎంపీలు, ఎమ్మెల్యేలు వీడ్కోలు పలికారు.

## బలమైన అన్నాడీఎంకేను కోరుకుంటున్నారు

కలిసి నడుద్దాం రండి ● ఈపీఎస్‌కు శశికళ పిలుపు



అడయార్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంతో కూడిన బలమైన అన్నాడీఎంకేను ప్రజలు కోరుకుంటున్నారని, అందువల్ల ప్రతి నేతా, కార్యకర్తా ఏకతాటిపైకి రావాలని ఆ పార్టీ బహిష్కృత నాయకురాలు శశికళ పిలుపునిచ్చారు. ఇదే విషయంపై ఆమె శనివారం ప్రకటన విడుదల చేశారు. ఏ పార్టీ (డీఎంకే)ని అయితే అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలనుకున్నారో, రాజకీయ క్షేత్రంలో లేకుండా చేయాలని ఎంజీఆర్, జయలలిత కోరుకున్నారో ఆ పార్టీ అధికారంలోకి వచ్చేలా చేశామన్నారు. భవిష్యత్తులో ఈ తప్పు పునరావృత్తం కారాదన్నారు. అందుకే పార్టీ నేతలంతా ఏకం కావాలని ఎంతో కాలంగా పిలుపునిస్తున్నానని పేర్కొంటూ.. ఈ విషయంలో తనకు ఎలాంటి స్వార్థం లేదన్నారు. ఎల్లవేళలా ప్రజాక్షేమాన్ని మాత్రమే ఆకాంక్షిస్తుంటాన న్నారు. తన కుటుంబం పార్టీనే అని, తనను ఎవ్వరూ ఒక సర్కిల్‌లో బంధించలేరన్నారు. పార్టీకి చెందిన నేతలపై తనకు ఎలాంటి కోపతాపాలు లేవన్నారు. ఇంతకంటే కఠిన పరీక్షలను తన బాల్యంలోనే ఎదుర్కొని వచ్చినట్టు వెల్లడించారు. తాను ఇద్దరు గొప్ప వ్యక్తుల వద్ద శిక్షణ పొందానని, ఇది తనను ఎంతగానో పరిణితి చెందేలా చేసిందన్నారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంజీఆర్ విధి విధానాలు, అణిగిమణిగి ఉండే లక్షణాలు తనను ఎంతో పాఠాలు నేర్పించిందన్నారు. అందరిలో ఒకరిగా, సోదరిగా కలిసిపోయి పార్టీ కోసమే తాను పని చేసేందుకు ఇష్టపడుతానన్నారు. పార్టీ, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే ఇప్పటివరకు తన కార్యాచరణ ఉన్నదని వెల్లడించారు. 2021లో కూడా పార్టీ విజయం సాధించాలన్న ఏకైక లక్ష్యంతోనే, అన్నాడీఎంకే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని భావించే ఎన్నికల్లో పోటీ నుంచి దూరంగా ఉన్నానని తెలిపారు. కానీ, ఆ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించకపోగా, ఇప్పటివరకు జరిగిన ఏ ఒక్క ఎన్నికల్లో పార్టీ ఒక్క గెలుపును కూడా సొంతం చేసుకోలేకపోవడం తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. ఈ పరిస్థితులను చూస్తూ మిన్నకుండిపోవడం అనేది మన నేతలకు మనం చేసే అతిపెద్ద ద్రోహంగా భావిస్తున్నట్టు తెలిపారు. "గతం గతః. ఈ పార్టీ కార్యకర్తలది. వారి నిర్ణయమే అంతిమ నిర్ణయం. వారి నిర్ణయానికి కట్టుబడి మనమంతా ఐకమత్యంతో ముందుకు సాగుదాం" అని ఆమె పిలుపునిచ్చారు. అవకాశ రాజకీయవాదులకు మనం ఏమాత్రం చోటు ఇవ్వరాదన్నారు. ఒక చేత్తో కొడితే ఎలా శబ్ధం రాదో... అదే విధంగా ఒంటరిగా వెళ్లడం వల్ల ఎలాంటి విజయం చేకూరదన్నారు. అన్నాడీఎంకేలో ప్రస్తుత పరిణామాలను డీఎంకే అనుకూలంగా మలుచుకుని చలి కాచుకుంటోందన్నారు. శక్తిమంతమైన పార్టీని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, అలాగే, అనేక రాజకీయ పార్టీలు కూడా దీన్నే కోరుకుంటున్నాయన్నారు. వారందరి అభీష్టం మేరకు శక్తిమంతమైన అన్నాడీఎంకేను తయారు చేసి, ఐకమత్యంతో ముందుకు సాగుతూ అధికార డీఎంకేకు గుణపాఠం నేర్పుదామని శశికళ పిలుపునిచ్చారు.

## బాబోయ్ ఫీవర్!

చెన్నైలో పెరుగుతున్న జ్వరాల వ్యాప్తి



పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాల్లో కొద్దిరోజులుగా జ్వరాలు ప్రబలు తున్నాయి. జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారు అధికమవుతున్నారు. రాజధాని నగరం చెన్నైలో మాత్రమే జ్వరంతో బాధపడుతూ సుమారు 1,000 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా తదితర జ్వరాల వ్యాప్తి అధికంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. నగరంలో కొద్దిరోజులుగా సాయంత్రం, రాత్రి వేళల్లో మోస్తరు వర్షం, పగటి వేళల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటూ వాతావరణం తరచూ మారుతుండడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఒళ్లు నొప్పులు, పొడి దగ్గు, చలి జ్వరాలకు చికిత్సలు పొందినా వెంటనే నయం కావడం లేదు. కొంతమందికి రెండు వారాలకు పైగా ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి ఉంటున్నాయి. వాతావరణం మార్పులతో వ్యాప్తి చెందుతున్న ఈ జ్వరాల బారిన వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు అధికంగా బాధపడుతున్నారు. ఈ విషయమై వైద్య నిపుణులు మాట్లాడుతూ... నగరంలో వాతావరణ మార్పుల కారణంగా వైరస్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని, ప్రస్తుతం 70 శాతానికి పైగా 'ఇన్‌ఫ్లుయింజా' జ్వరం వ్యాప్తి ఉందన్నారు. అలాగే, డెంగ్యూ జ్వరం వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. అడపాదడపా వర్షాలు కురిస్తే మంచినీటిలో వృద్ధి చెందే 'ఎడిస్' దోమల పెరుగుదల అధికమయ్యే అవకాశముందన్నారు. ప్రజలు తమ ఇళ్లు, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు ఆకు కూరలు, పండ్లు, వ్యాధి నిరోధక శక్తి పెంచే ఆహార పదార్థాలు తీసుకోవాలని, తరచూ చేతులు శుభ్రపరచుకోవడం, మాస్క్ ధరించడం వంటి చర్యల ద్వారా వైరల్ జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

## మూపనార్‌ను ప్రధాని కాకుండా అడ్డుకున్నారు

డీఎంకే కూటమిపై నిర్మలమ్మ ధ్వజం



మూపనార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, ఈపీఎస్, జీకే వాసన్, నయినార్ నాగేంద్రన్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన దివంగత జీకే మూపనార్‌ను ప్రధానమంత్రిని కాకుండా అప్పట్లో డీఎంకే నేతలు అడ్డుకున్నారని, తద్వారా తమిళులకు తీరని ద్రోహం చేశారని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజమెత్తారు. తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) వ్యవస్థాపకుడు జీకే మూపనార్ 24వ వర్ధంతి సందర్భంగా స్థానిక తేనాంపేటలో ఉన్న ఆయన స్మారక మందిరంలో శనివారం సర్వమత ప్రార్థనలు, సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. మూపనార్ సమాధిపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షుడు అన్నామలై, బీజేపీ సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్, జీసీసీ మాజీ డిప్యూటీ మేయర్ కరాటే త్యాగరాజన్, డీఎండీకే కోశాధికారి సుధీష్, మాజీ మంత్రులు ఆర్.కామరాజ్, విజయ్‌భాస్కర్, టీఎంసీ నేతలు జి.ఆర్.వెంకటేష్, వి.కె.అరుణ్‌కుమార్, జవహర్‌బాబు, న్యూ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు షణ్ముగం, ఇండియా జననాయగ కట్చి అధ్యక్షుడు రవి పచ్చముత్తు, తమిళనాడు కుమ్మరుల సంఘ అధ్యక్షుడు సేమ నారాయణన్ తదితరులు నివాళులర్పించారు. వేదికపై ఎన్డీయే కూటమి రాష్ట్ర నేతలను నిర్మలమ్మ పలకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... జీకే మూపనార్, దివంగత మాజీముఖ్యమంత్రి కామరాజర్ నిరాడంబరంగా, నిజాయితీగా వ్యవహరించి కాంగ్రెస్ పార్టీలో ప్రధాన పాత్రపోషించారని కొనియాడారు. తాను కళాశాలలో చదువుకున్నప్పుడు మూపనార్‌ను నేరుగా చూశానని, ఆయన సలహాలను కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించేదన్నారు. దేశ రాజకీయాల్లో విశేష అనుభవం కలిగిన మూపనార్‌కు ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చిందని, అయితే ఆయన ప్రధాని పీఠం ఎక్కకుండా అడ్డుకుని తమిళులకు డీఎంకే ద్రోహం చేసిందని మండిపడ్డారు. ఒకవేళ మూపనార్ ప్రధానమంత్రి అయ్యివుంటే తమిళనాడుకు మరింత గుర్తింపు వచ్చి ఉండేదన్నారు. మూపనార్ సిద్ధాంతాలకు అనుగుణంగా రాష్ట్రంలో మంచి పాలన వచ్చేందుకు ఎన్డీయే కూటమిలో ఉన్న నేతలందరూ కృషి చేయాలని, కూటమి నేతలు ఐక్యతగా వ్యవహరించి ప్రజలకు కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. మనస్పర్థలు పక్కనబెట్టి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా, మూపనార్ సమాధి వద్ద అంజలి ఘటించేందుకు వెళ్లిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన వెనుక నిలబడివున్న అన్నామలైను తన దగ్గరకు వచ్చి నిలబడమని పిలిచారు. ఆ తర్వాత వారిద్దరూ కలిసి మూపనార్ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి పక్కపక్కనే కూర్చున్నారు. ఈ వేదికపై చాలా రోజుల తర్వాత ఈపీఎస్-అన్నామలై ఆప్యాయంగా పలకరించుకోవడంతో ఎన్డీయే కూటమి కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంది.

## సమాచార దర్శిని

### రేపు మనోన్మణియం సుందరనార్ వర్శిటీ పునఃప్రారంభం

ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మధ్య తలెత్తిన గొడవల కారణంగా నిరవధికంగా మూసివేసిన తిరునల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం సెప్టెంబరు 1న సోమవారం పునఃప్రారంభమవుతుందని వర్శిటీ వీసీ పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థి లక్ష్మీనారాయణన్(18) గురువారం తన ద్విచక్రవాహనాన్ని పార్కింగులో ఆపకుండా క్యాంటిన్ దగ్గరకు తీసుకెళ్లాడు. దీంతో రెండో ఏడాది హిస్టరీ విద్యార్థి అరుళ్‌ముత్తుసెల్వన్ దీనిపై ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. రెండు గ్రూపులుగా ఏర్పడి ఘర్షణలకు దిగడంతో లక్ష్మీనారాయణన్, అరుళ్‌ముత్తుసెల్వన్ తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు విద్యార్థులను అరెస్టు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా వర్శిటీని నిరవధికంగా మూసివేశారు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వచ్చే సోమవారం నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు వీసీ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ప్రకటించారు.

### 5 వరకు ఏవీఎం దహనవాటిక మూసివేత

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏవీఎం దహనవాటిక సెప్టెంబరు 5వ తేది వరకు మూసివేయనున్నట్టు చెన్నై కార్పొరేషన్ ప్రకటించింది. కోడంబాక్కం మండలం 135వ వార్డులో ఉన్న ఏవీఎం దహనవాటికలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో, శనివారం నుంచి సెప్టెంబరు 5వ తేది వరకు మూసివేయనున్నారు. అన్నై సత్యానగర్, కన్నమ్మపేటల్లో ఉన్న శ్మశానవాటికలను ప్రజలు వినియోగించుకోవాలని కార్పొరేషన్ తెలిపింది.

### ఏడు గ్రామాల్లో వసతుల కల్పనకు రూ.21 కోట్లు

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలోని ఏడు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.21 కోట్లు కేటాయిస్తూ సీఎండీఏ ఉత్తర్వులు జారీచేసింది. కుండ్రత్తూర్ పంచాయతీ యూనియన్ పరిధిలోని కోలంబాక్కం, కోవూరు, గెరుగంబాక్కం, అయప్పన్‌తాంగళ్, భరణిపుదూర్, మౌలివాక్కం, తండలం తదితర ఏడు గ్రామాల్లో రోడ్లు, పార్కులు, కమ్యూనిటీ హాల్, వాన నీటి కాలువలు తదితరాల ఏర్పాటుకు రూ.21 కోట్లు ఆయా పంచాయతీలకు అందజేసి పనులు ప్రారంభించనున్నట్లు సీఎండీఏ తెలిపింది.

### పెరంబలూరు కలెక్టర్‌గా మృణాళిని

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పెరంబలూరు జిల్లా కలెక్టర్‌గా మృణాళిని నియమితులయ్యారు. ఈ జిల్లా కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న అరుణ్‌రాజ్, చక్కెర శాఖ అదనపు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కాంచీపురం సబ్ కలెక్టర్ మృణాళినిని పెరంబలూరు జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం ఉత్తర్వులు జారీ చేశారు.

### టాస్మాక్‌లో ఉద్యోగుల బదిలీ

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 10 ఏళ్లకు పైగా ఒకే స్థానంలో పనిచేస్తున్న వారిని బదిలీ చేయాలని, ఈ ప్రక్రియ సెప్టెంబరు లోగా పూర్తి చేయాలని టాస్మాక్ సంస్థ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ టాస్మాక్ సంస్థ 4,787 దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తుండగా, ఆ దుకాణాల్లో 23,629 మంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం టాస్మాక్ ఉద్యోగులను ఆయా జిల్లాల్లోని ఇతర మద్యం దుకాణాలకు బదిలీ చేస్తున్నారు. కొందరు మాత్రం కొనేళ్లుగా ఒకే దుకాణంలో పనిచేస్తుండడంతో, అవినీతి జరుగుతోందని ఫిర్యాదులందాయి. ఈ విషయమై దృష్టి సారించిన టాస్మాక్... ఒకే దుకాణంలో 10 ఏళ్లకు పైగా పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని నిర్ణయించింది.

### ఎండీ యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యోగా, ప్రకృతి వైద్యకళాశాలల్లో ప్రభుత్వ కోటా సీట్లకు ఎండీ (యోగా మరియు ప్రకృతి వైద్యం) కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన విద్యార్థులు www.tnhealth.tn.gov.in, www.tnayushselection.org లలో ఆదివారం నుంచి తగిన సర్టిఫికెట్లతో దరఖాస్తులు సమర్పించాలి. ఆన్‌లైన్ వసతి లేని వారు స్థానిక అరుంబాక్కంలోని భారత వైద్యం, హోమియోపతి శాఖ కార్యాలయంలో సెప్టెంబరు 12వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు అందజేయాలని హోమియోపతి శాఖ కమిషనరేట్ తెలిపింది.

### విజయ్ కనిపిస్తే ముఖంపై పిడిగుద్దులు కురిపిస్తా

**నటుడు రంజిత్ మండిపాటు**

అడయార్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మదురై మహానాడు వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించిన టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎదురుగా కనిపిస్తే ముఖంపై పిడిగుద్దులు కురిపించాలన్న కసి ఉందని సినీ నటుడు, బీజేపీ నేత రంజిత్ అన్నారు. కోయంబత్తూరు తుడియలూరు జంక్షన్‌లో వినాయక ప్రతిమల నిమజ్జనం ఊరేగింపులో ఆయన మాట్లాడుతూ... చిత్రపరిశ్రమలో శిఖరాగ్రంలో ఉండగా, ఆ కెరీర్‌ను వద్దనుకుని రాజకీయాల్లోకి వచ్చినట్టు విజయ్ చెప్పారన్నారు. దివంగత నటులు ఎంజీఆర్, జయలలిత, విజయకాంత్, అగ్రనటుడు కమల్‌ను ఉద్దేశించి మాట్లాడారా? అని ప్రశ్నించారు. పైగా దేశ ప్రధాని నరేంద్రమోదీని మిస్టర్ ప్రధాని అంటూ సంబోధించడం ఎక్కడి నాగరికత అన్నారు.

### విదేశీ కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా వ్యాపారుల మహాధర్నా



ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): లూలూ, వాల్ మార్ట్ తదితర విదేశీ కార్పొరేట్ వాణిజ్య సంస్థలకు వ్యతిరేకంగా శనివారం తిరుచ్చిలో నిర్వహించిన ధర్నాలో వ్యాపారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేశంలో రోజురోజుకు కార్పొరేట్ సంస్థల ఆధిక్యత పెరుగుతున్నందువల్ల చిల్లర వ్యాపారాలకు కుంటు పడింది. ఆన్‌లైన్ ద్వారా అధికంగా లబ్ధిపొందుతున్న విదేశీ కార్పొరేట్ సంస్థల లైసెన్సులను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తమిళనాడు వ్యాపారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఏ.ఎం.విక్రమ్‌రాజా అధ్యక్షతన తిరుచ్చి వయలూరు రోడ్డులో జరిగిన ధర్నాలో చెన్నై, తిరుచ్చి, మదురై, కోవై, సేలం, తంజావూరు, పుదుకోట, పెరంబలూరు, కరూర్, అరియలూరు, ధర్మపురి, ఈరోడ్, నామక్కల్ తదితర జిల్లా వ్యాపారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉత్పత్తులు, పరిశ్రమలకు విధించిన పన్నులను తగ్గించాలని, రాష్ట్ర జనాభాలో వ్యాపారులే అధికంగా ఓటు హక్కు కలిగి ఉన్నారన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించాలని ఆయన హెచ్చరించారు.

# అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించండి

**● అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశంలో ఈపీఎస్**



జిల్లా కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఈపీఎస్

ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేయాలని అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి పిలుపునిచ్చారు. స్థానిక రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో శనివారం ఉదయం 11 గంటలకు ఆ పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుసేన్ అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. పార్టీ కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, ప్రధాన కార్యాలయ కార్యదర్శి ఎస్పీ వేలుమణి, మాజీ మంత్రులు కేపీ మునిస్వామి, నత్తం విశ్వనాథన్‌తో పాటు పార్టీ పరంగా 85 జిల్లాల కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన ఈపీఎస్‌కు ఘనస్వాగతం పలికారు. 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ ప్రధాన నిర్వాహకుల నుంచి సాధారణ కార్యకర్తల వరకు చేపట్టాల్సిన ప్రచారం, గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలతో ముద్రించిన కరపత్రాలు, బూత్ కమిటీల పనితీరుపై గురించి కూలంకషంగా చర్చించారు. ఎన్నికలపై పలువురు నేతలు అభిప్రాయాలు తెలియజేసిన అనంతరం ఈపీఎస్ సభనుద్దేశించి మాట్లాడారు. మూడు విడతల ప్రచారంలో ఇప్పటివరకు 118 నియోజకవర్గాల్లో సుమారు 60 లక్షల మంది నేరుగా కలుసుకుని ఓట్లు అభ్యర్థించినట్లు తెలిపారు. అధికార డీఎంకే ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, ఆయా జిల్లాలో ఉన్న పార్టీ నిర్వాహకులు ప్రజాభిప్రాయాలను తెలుసుకుని ప్రచారంగా మార్చాలని సూచించారు. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల్లో తిష్ఠ వేసిన సమస్యలను పరిష్కరించేందుకు, మౌలిక సదుపాయాలు కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. పార్టీ పదవుల్లో లేనివారు, సీనియర్ సభ్యులను కలుపుకుని పార్టీకోసం పనిచేయాలన్నారు. మిత్రపక్షాల నేతలపై విమర్శలు గుప్పించకుండా కలసికట్టుగా వ్యవహరించాలని ఈపీఎస్ సూచించారు.

# పార్కులో మందుబాబుల వీరంగం



ఈ నేపథ్యంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మద్యం తాగి ఆ పార్కు గేట్లను ధ్వంసం చేశారు.



పార్కులో ధ్వంసమైన సిమెంటు బల్లలు - కూలిన గేటు

తిరుత్తణి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని షోళింగర్ రోడ్డులో ఉన్న పార్కులో శనివారం ఉదయం మందుబాబులు వీరంగం సృష్టించారు. పంచాయతీ నిర్వహణలోని పార్కుల్లో రాష్ట్రప్రభుత్వం పిల్లలు ఆడుకునేందుకు సదుపాయాలు ఏర్పాటు చేసి అందులో చెట్లు పెంచి ఆహ్లాదకరంగా చేసింది. కానీ ఆ పార్కుల్లో మందుబాబులు రోజు మద్యం సేవించి పిల్లలు, వృద్ధులు ఆ ప్రాంగణాలకు రాకుండా చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం టౌన్ పంచాయతీ కార్యనిర్వాహణాధికారి రాజ్‌కుమార్ పరిశీలించారు. సాయంత్రం 8 గంటలకు పార్కుకు తాళాలు వేయాలని సూచించారు. అనంతరం మద్యం సీసాలతో పార్కు మొత్తం వీరంగం సృష్టించారు. శనివారం ఉదయం పార్కుకు వెళ్లిన వాకర్స్ అది చూసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# శ్రీలంక హార్బర్‌లో ఉంచిన రాష్ట్ర జాలర్ల పడవల వేలం



మైలిటి ఫిషింగ్ హార్బర్‌లో ఉంచిన రాష్ట్ర జాలర్ల పడవలు

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక హార్బర్‌లో ఉంచిన రాష్ట్ర జాలర్ల పడవలు వేలం వేయనున్నారు. శ్రీలంక నావికాదళం గత 11 ఏళ్లలో సుమారు 500 పడవలను స్వాధీనం చేసుకుని, 3,800 మంది జాలర్లను అరెస్ట్ చేసింది. జాలర్ల దీర్ఘకాల ఆందోళనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో జైలు శిక్ష, జరిమానా లేకుండా రాష్ట్ర జాలర్లను విడుదల చేసినా, పడవలను మాత్రం అప్పగించలేదు. ఈ క్రమంలో, 2018 ఫిబ్రవరి నుంచి శ్రీలంక కోర్టులు, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన 180 పడవలను జాతీయం చేశాయి. ఆ పడవలను తలైమన్నార్, కంకేసంతురై, మైలిట్టి ఫిషింగ్ హార్బర్లలో నిలిపి ఉంచారు. మైలిట్టి ఫిషింగ్ హార్బర్‌లో నిలిపి ఉంచిన 123 పడవల్లో 48 పడవలకు సంబంధించిన కేసులు విచారణలో ఉన్నాయి. కోర్టు ఉత్తర్వులతో, ఏడు పడవలను రామేశ్వరం జాలర్లను తీసుకురాగా, జాతీయం చేయబడిన 68 పడవలు హార్బర్‌లో ఉంచారు. శ్రీలంక అధ్యక్షుడు అతుర కుమార దిశనాయకే సెప్టెంబరు మొదటి వారంలో మైలిటి హార్బర్‌ను సందర్శించనున్న నేపథ్యంలో, హార్బర్‌లోని రాష్ట్ర జాలర్ల పడవలు అచెవెలికి తరలించేందుకు డిస్మాంటిల్ చేస్తారంటూ వార్తలు వెలువడ్డాయి. అలాగే, కొన్ని పడవలు వేలం వేయనున్నట్లు సమాచారం. కాగా, గతంలో శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకున్న పవర్ పడవలను ఒక్కోటి రూ.8 లక్షలు, ఫైబర్ పడవలను తలా రూ.2 లక్షలను రిలీఫ్ గ్రాంట్‌గా అందచేశారు.

### రేపు క్రమశిక్షణ చర్యల కమిటీ సమావేశం

**● పీఎంకే అధినేత రాందాస్**

ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో సోమవారం పీఎంకే క్రమశిక్షణ చర్యల కమిటీ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ప్రకటించారు. పీఎంకేలో గత కొన్ని నెలలుగా పార్టీ పదవులు కేటాయించడంపై తండ్రీకొడుకుల మధ్య విభేదాలు ఇంకా కొలిక్కిరాలేదు. వారు పోటీపడి కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పీఎంకే సర్వసభ్యసమావేశంలో రాందాస్ వర్గీయులు అన్బుమణికి వ్యతిరేకంగా 13 తీర్మానాలు ప్రతిపాదించారు. అన్బుమణిపై 16 ఆరోపణల నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ తీర్మానం ఆమోదించారు. దీనిపై వివరణ కోరుతూ అన్బుమణికి క్రమశిక్షణ కమిటీ రాసిన లేఖ గడువు శనివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో, క్రమశిక్షణ కమిటీ సమావేశం వచ్చే సెప్టెంబరు 1న సోమవారం తైలాపురం గార్డెన్‌లో తన అధ్యక్షతన జరుగుతుందని రాందాస్ శనివారం ప్రకటించారు.

### ప్రపంచ అవసరాలు తీర్చేలా భారత ఉత్పత్తులు

**● డాక్టర్ రామదాస్**

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం అవసరాలు తీర్చేలా భారత ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో వుండాలని గ్లోబ్ ఆటోమోటివ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రామదాస్ పిలుపునిచ్చారు. గతంలో మనం భారత ప్రజల కోసం ఉత్పత్తులు చేపట్టేవాళ్లమని, ఇప్పుడు ప్రపంచం కోసం చేస్తున్నామని పేర్కొన్నారు. నేడు మనం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను పరిష్కరించేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీఐటీ చెన్నై 15వ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ప్రారంభమైన రెండు రోజుల సదస్సుకు ప్రత్యేక అతిథిగా హాజరైన డాక్టర్ రామదాస్ ప్రసంగించారు. ఈ సందర్భంగా వీఐటీ చెన్నై అసోసియేట్ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ టి.త్యాగరాజన్ వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాల ద్వారా విద్యార్థులకు రోబోటిక్స్, ఆటోమేషన్, నెట్‌వర్క్ సెక్యూరిటీలో శిక్షణ ఇవ్వడం, కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయడం వంటివాటిల్లో శిక్షణ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా వీఐటీ చెన్నై వైస్ ఛాన్స్‌లర్ వీఎస్ కాంచన భాస్కరన్, వీఐటీ చెన్నై డైరెక్టర్ సత్యనారాయణ, అదనపు రిజిస్ట్రార్ డాక్టర్ పీకే మనోహరన్ తదితరులు కూడా హాజరయ్యారు.

### గొడుగుల పంపిణీ



గొడుగు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఋషి పంచమిని పురస్కరించుకుని శనివారం వేలూరులో ప్రజా సేవా సంఘం తరుపున గొడుగులను పంపిణీ చేశారు. సుమారు 100 మందికి అందజేసి వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంఘ సబ్ ట్రెజరర్ రాధాకృష్ణన్, గోవిందన్, లక్ష్మీకుమార్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్‌ఫోన్ టార్చ్ వెలుగుల్లో కార్పొరేషన్ సమావేశం



సెల్‌ఫోన్ లైట్లు ఆన్‌చేసి పట్టుకున్న సిబ్బంది

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కుంభకోణం కార్పొరేషన్ కార్యాలయంలో విద్యుత్ కోత కొనసాగడంతో, మొబైల్‌ఫోన్ టార్చ్ వెలుగుల్లో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తంజావూరు జిల్లా కుంభకోణం కార్పొరేషన్ సమావేశం మేయర్ శరవణన్ నేతృత్వంలో పాత కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న హాలులో శుక్రవారం సాయంత్రం 4.10 గంటలకు ప్రారంభమైంది. కొద్ది నిమిషాలకు కరెంటు పోయింది. కార్యాలయంలోని జనరేటర్ కూడా దెబ్బతినడంతో, హాలు ప్రవేశ ద్వారం తలుపులు తెరచి సమావేశం ప్రారంభించారు. అయినా వెలుతురు సరిగా లేకపోవడంతో, మేయర్, డిప్యూటీ మేయర్, కౌన్సిలర్లు, కార్పొరేషన్ అధికారులు తమ మొబైల్ ఫోన్లలోని టార్చ్‌లు వెలిగించి సమావేశం నిర్వహించారు. సమావేశం నిర్వహణపై అభ్యంతరం తెలిపిన అన్నాడీఎంకే కౌన్సిలర్ ఆదిలక్ష్మి... అధికారులు, ప్రజా ప్రతినిధుల తీరు నిరసిస్తూ వాకౌట్ చేశారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలు తెలిపారు. అప్పటికి కూడా కరెంట్ రాకపోవడంతో 4.45 గంటలకు 37 తీర్మానాలు నెరవేరుస్తున్నట్లు తెలిపిన మేయర్ శరవణన్, సమావేశం ముగిసినట్లు ప్రకటించారు.

# ప్రభుత్వ బస్సులపై ప్రకటనలు తొలగించండి

**● మద్రాస్ హైకోర్టులో ప్రజా ప్రయోజనవాజ్యం**

ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్న బస్సులపై ఉన్న ప్రకటనలను తొలగించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలైంది. నామక్కల్ జిల్లా రాశిపురానికి చెందిన భాస్కర్ దాఖలు చేసిన పిటిషన్‌లో... రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు నడుపుతున్న బస్సుల్లో కిటికీలపై ఉన్న అద్దాలు, ముందు వెనుక భాగాన అంటించిన ప్రకటనల వల్ల బయటి నుంచి బస్సులో చూడలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఇది బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ఆటంకం కలిగించేలా ఉందన్నారు. అన్ని రకాల వాహనాలకు ఉన్న అద్దాలకు నలుపురంగు స్టిక్కర్లు అంటించడాన్ని నిషేధిస్తూ 2011లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఉదహరించారు. అయితే సుప్రీం తీర్పును పాటించకుండా ప్రభుత్వ బస్సుల్లో ప్రకటనలు అంటించడం కోర్టు ధిక్కరణ చర్యల కింద వస్తుందని ఇది మోటరు వాహన చట్టాలకు కూడా విరుద్ధమని భాస్కర్ తన పిటిషన్‌లో తెలిపారు. ఈ పిటిషన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాత్సవ, జస్టిస్ సుందర మోహన్ ప్రథమ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు తదితర మోటరువాహన చట్ట నిబంధనలను అమలుపరిచేందుకు తీసుకున్న చర్యలపై నివేదిక దాఖలు చేయాల్సిందిగా రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు ప్రథమ ధర్మాసనం... విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

# రోడ్డు కోసం రూ.32 కోట్ల స్థలం విరాళం

**● పొల్లాచ్చి దంపతుల ఔదార్యం**



స్థల పత్రాలు అందజేస్తున్న శాంత జయరామన్

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చిలో రోడ్డు ఏర్పాటుకు రూ.32 కోట్ల 80 సెంట్ల స్థలాన్ని ఓ కుటుంబం మున్సిపాలిటీకి విరాళంగా అందజేసింది. కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి పల్లడం రోడ్డు, ఉడుమలై రోడ్డు అనుసంధాన పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం మున్సిపాలిటీ 2009లో భూసేకరణ చేపట్టింది. అనుసంధాన రోడ్డు నిర్మించే ప్రాంతంలో శాంత జయరామన్‌కు సొంతమైన 80 సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలం సేకరించేందుకు అధికారులు ప్రయత్నించారు. అధికారుల చర్యలకు వ్యతిరేకంగా శాంత జయరామన్ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ నేపథ్యంలో, పొల్లాచ్చి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన గణేశన్, శాంత జయరామన్ కుటుంబ సభ్యులతో పలుమార్లు చర్చించారు. ఈ రోడ్డు ఏర్పాటుతో వాహనచోదకులు, ప్రజలకు అనుకూలంగా ఉంటుందని కమిషనర్ వారికి వివరించారు. దీంతో, రూ.32 కోట్ల విలువైన 80 సెంట్ల స్థలాన్ని దానంగా అందించేందుకు శాంత జయరామన్ కుటుంబ సభ్యులు అంగీకరించారు. అలాగే, ఈ స్థలానికి మున్సిపాలిటీ వేసిన రూ.49 లక్షల పన్ను కూడా శాంత జయరామన్ చెల్లించారు. ఈ క్రమంలో, స్థలానికి సంబంధించిన పత్రాలను శనివారం శాంత జయరామన్, మున్సిపల్ కమిషనర్ గణేశన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్యామల నవనీత కృష్ణన్, డిప్యూటీ చైర్మన్ గౌతమన్, పొల్లాచ్చి నగర డీఎంకే ఆర్గనైజర్ నవనీతకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శాంత జయరామన్ మీడియాతో మాట్లాడుతూ.. పొల్లాచ్చి నగరం పల్లడం రోడ్డులో తమ కుటుంబానికి 2 ఎకరాల స్థలం ఉందని, అందులో తనకు, తన కుమారుడు, కుమార్తెకు వాటాగా వచ్చిన 80 సెంట్ల స్థలాన్ని పొల్లాచ్చి కార్పొరేషన్‌కు విరాళంగా అందించామన్నారు.

# పచ్చి అబద్ధాలే డీఎంకే పెట్టుబడి

**● పీఎంకే, బీజేపీ నేతల విమర్శ**

ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో డీఎంకే ప్రభుత్వం చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలేనని పీఎంకే, బీజేపీ నాయకులు విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టుకునేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ 9 రోజుల పర్యటనగా జర్మన్, ఇంగ్లండ్ దేశాలకు శనివారం తరలివెళ్లారు. ఈ నేపథ్యంలో, సీఎం స్టాలిన్ పెట్టుబడులపై అసత్యాలు చెబుతున్నారని, ఇప్పటివరకు తీసుకువచ్చిన పెట్టుబడుల పై శ్వేతపత్రం విడుదల చేయాలని నాలుగేళ్లుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోలేదని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి చెప్పారు. 2021లో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10.62 లక్షల కోట్ల పెట్టుబడులతో 922 ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు సీఎం తెలిపారని, అయితే ఈ ఒప్పందాలు అమల్లోకి తీసుకురావడంలో స్పష్టతలేదన్నారు. స్టాలిన్ ప్రభుత్వం సంతకాలు చేసిన పెట్టుబడుల ఒప్పందాల్లో 10శాతం కూడా నెరవేరలేదన్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ సీఎం విదేశీ పర్యటనను విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడులు రాబట్టుకునేందుకు సీఎం విదేశాలకు వెళ్లడాన్ని బీజేపీ వ్యతిరేకించడంలేదని, అయితే ఈ నాలుగున్నారేళ్ల డీఎంకే ప్రభుత్వం పెట్టుబడుల ద్వారా ఏ మేరకు రాష్ట్రంలో పరిశ్రమల రంగాన్ని అభివృద్ధి పరిచిందో వివరించలేదన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పెట్టుబడుల కోసం ప్రజాధనం వెచ్చించి విదేశాలకు వెళ్లకుండా ఉన్నచోటు నుండే రూ.7.12లక్షల కోట్లు రాబట్టుకోగలిగారని, అదేవిధంగా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ తన దావోస్ పర్యటనలో రూ.15లక్షల కోట్ల పెట్టుబడులను ఆ రాష్ట్రానికి తీసుకొచ్చారని గుర్తు చేశారు. భారీస్థాయిలో ప్రకటించుకున్న స్పెయిన్ పర్యటన కేవలం 3 ఒప్పందాలతో ముగిసిందన్నారు. అదేవిధంగా అమెరికా తదితర దేశాల్లో పర్యటించి తీసుకొచ్చిన పెట్టుబడులు ఏమయ్యాయని నయినార్ రాష్ట్రప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

### ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదులో మదురై జిల్లా ప్రథమస్థానం

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదులో మదురై జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో దక్షిణాదిలోని 9 జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ కేసులు ఏ మేరకు నమోదయ్యాయంటూ సామాజిక కార్యకర్త కార్తీక్ ఆర్‌టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు పోలీస్‌శాఖ వివరాలు అందించింది. 2020-25 మధ్య దక్షిణాదిలోని 9 జిల్లాల్లో 3,041 కేసులు నమోదయ్యాయి. అందులో ఒక్క మదురైలోనే జిల్లాలో 514 కేసులున్నాయి. ఇక తేని జిల్లాలో 465 కేసులు, పుదుకోట జిల్లాలో 440 కేసులు నమోదయ్యాయి. మొత్తం 3,041 కేసుల్లో 509 తప్పుడు కేసులుగా తేలడంతో అవి రద్దయ్యాయి. ఇలా రద్దయిన కేసుల్లో పుదుకోట జిల్లా ప్రథమస్థానంలో నిలవడం గమనార్హం.

### కళాశాలకు పంపడం లేదని ఇంటినుంచి వెళ్లిపోయిన విద్యార్థి



రమేష్

వేలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని పళ్లికుప్పానికి చెందిన రమేష్ (19)అనే విద్యార్థి తనను తండ్రి కళాశాలకు పంపడం లేదనే మనస్తాపంతో ఇంటినుండి వెళ్లిపోయాడు. ప్రైవేటు పాలిటెక్నిక్‌లో రమేష్ చదువుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో, గత నెల అతని తండ్రి రమేష్ చదువును ఆపేసి ఇంటివద్దనే ఉండమని నిర్బంధించాడని సమాచారం. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రమేష్ తల్లిదండ్రులకు చెప్పకుండా ఉత్తరం రాసి వెళ్లిపోయాడు. దీనిపై విద్యార్థి తండ్రి ఫిర్యాదుతో పోలీసులు రమేష్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

### శంకరన్‌పాళయంలో డయాబెటిస్ ఆస్పత్రి ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

వేలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా శంకరన్‌పాళయంలోని దురైసింగ పిళ్లైవీధిలో శనివారం ఉదయం డయాబెటిస్ ఆస్పత్రి ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. అన్నైమీరా ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ దామోదరన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, వేలూరు మేయర్ సుజాత, వేలూరు వీఐటీ ఛాన్స్‌లర్ విశ్వనాథన్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నందకుమార్ మాట్లాడుతూ, ఈ ఆస్పత్రి గ్రామీణ ప్రాంతాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిందన్నారు. నగరాల్లో ఉండే అత్యాధునిక యంత్రాలు, సదుపాయాలతో ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దామోదరన్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నత విద్యపై అవగాహన కార్యక్రమం

వేలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం కేఎంజీ కళాశాలలో శనివారం ఉదయం సీఎం విద్యాభివృద్ధి పథకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆ కళాశాల నిర్వాహకులు నిర్వహించారు. కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విద్యాశాఖ అధికారి దయాళన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, విద్యతోనే ఉన్నతస్థాయికి చేరుకోగలమని, విద్యార్థులంతా శ్రద్ధగా చదువుకుని మంచిస్థితికి రావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ దండపాణి, ఉపాధ్యాయులు, 10, 12 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

### 2న బాండ్ల వేలం

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.3,000 కోట్ల విలువైన బాండ్లు వేలం వేయనుంది. వాటిలో 2 సంవత్సరాల బాండ్లు రూ.1,000 కోట్లు, 9 సంవత్సరాల బాండ్లు రూ.1,000 కోట్లు, 30 సంవత్సరాల బాండ్లు రూ.1,000 కోట్లు వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ వేలం ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ కార్యాలయంలో సెప్టెంబరు 2వ తేది జరుగనుంది. పోటీ బిడ్డింగ్ ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుంది. పోటీ లేని బిడ్డింగ్ ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ వ్యవస్థ (Reserve Bank of India Core Banking Solition (E-Kuber) System) ఎలక్ట్రానిక్ రూపంలో (Electronic format) సెప్టెంబరు 2వ తేది సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

### 3నుంచి టెన్త్ ఒరిజినల్ మార్కుల జాబితా

పెరంబూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): టెన్త్ ఒరిజినల్ మార్కుల జాబితా సెప్టెంబరు 3వ తేది నుంచి విద్యార్థులు పొందవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది. గత విద్యా సంవత్సరంలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు గత మార్చి 28 నుంచి ఏప్రిల్ 15వ తేది వరకు నిర్వహించగా, 8.71 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ పరీక్షా ఫలితాలు మే 16వ తేది విడుదల చేసి, 19వ తేది నుంచి తాత్కాలిక మార్కుల జాబితా అందజేశారు. ఈ నేపథ్యంలో, టెన్త్ ఒరిజినల్ మార్కుల జాబితా సెప్టెంబరు 3వ తేది విడుదల చేయనున్నట్లు, విద్యార్థులు తాము చదివిన పాఠశాలలు, ప్రైవేటు విద్యార్థులు తాము పరీక్షలు రాసిన కేంద్రాల్లో పొందవచ్చని పరీక్ష శాఖ తెలిపింది.

### రెండవ రోజుకు చేరిన తిరువళ్లూరు ఎంపీ నిరాహార దీక్ష

చెన్నై, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ చేపట్టిన నిరాహార దీక్ష శనివారం రెండో రోజుకు చేరింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి విద్యానిధులను కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ కేంద్రప్రభుత్వం విద్యా నిధులు అందించే వరకు తాను నిరాహార దీక్ష చేస్తానని ఎంపీ ప్రకటించిన విషయం విదితమే. విద్యారంగంలో అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉన్న తమిళనాడును విస్మరించడం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమన్నారు. బీజేపీ పాలన రహిత రాష్ట్రాలకు కేంద్రం నిధులు అందించడం లేదని, ఈ విషయమై కేంద్ర విద్యాశాఖ మంత్రికి పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో తాను దీక్ష చేపట్టినట్లు ఎంపీ తెలిపారు.

## పర్యాటకులకు ఆకర్షణ

# పద్మనాభపురం ప్యాలెస్



వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

**చారిత్రక ప్రదేశాలను ఇష్టపడేవారు కొందరైతే, ప్రకృతి సౌందర్యోపాసకులు మరికొందరు. శిల్ప, చిత్రకళలకు ప్రాధాన్యమిచ్చే కళాపిపాసులు ఇంకొందరు. చారిత్రక ప్రాముఖ్యంతో పాటు సుందరమైన కుడ్యచిత్రాలతో, ఆకట్టుకొనే నిర్మాణ కౌశలం ఉట్టిపడే అందమైన ప్యాలెస్‌లు ఉంటే సందర్శించేందుకు 'క్యూ' కట్టని వారుంటారా? మరి అలాంటి ప్యాలెస్‌ని చూడాలనుకుంటున్నారా? అయితే 'పద్మనాభపురం' వెళదాం.**

SUNDAY SPECIAL

తిరువనంతపురం నుంచి 55 కిలోమీటర్ల దూరంలో 'తుక్కలై' గ్రామానికి తూర్పున రెండు 2కి.మీ దూరంలో, త్రివేండ్రం - కన్యాకుమారి రహదారిపై కన్యాకుమారి నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది ఈ పురాతన చారిత్రక పట్టణం 'పద్మనాభపురం'. పద్మనాభపురం అంటే మహావిష్ణువు నగరం - ట్రావెన్‌కోర్ రాజుల ప్రాచీన రాజధాని.





### కేరళ నిర్మాణ శైలి...

పద్మనాభపురం ప్యాలెస్ సంప్రదాయ కేరళ నిర్మాణశైలికి ఉత్తమ ఉదాహరణ అని చెప్పుకోవచ్చు. ప్యాలెస్‌లోని క్లాక్‌టవర్‌లో 300యేళ్ల నాటి పురాతన గడియారం ఉంది. అది ఇప్పటికీ సమయాన్ని చూపుతుంటోంది. ప్యాలెస్ ప్రవేశద్వారం పెద్ద తలుపులతో రాజఠీవిని ఒలకబోస్తుంది. దాన్ని దాటగానే నగిషీ చెక్కిన తలుపులతో సంప్రదాయ కేరళశైలిలో 'పూముఖం' అనే హాలును చూడవచ్చు. దాని పైకప్పులో అందంగా చెక్కబడిన 90 పూలు కలిగిన డిజైన్లు కనువిందు చేస్తాయి. ఆ గదిలోనే ఉన్న గ్రానైట్ మంచం, చైనా నిర్మాణశైలిలో సింహాసనం, ప్రాంతీయ ప్రముఖులు రాజుకు బహూకరించిన విల్లులు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. ఈ పూముఖం పైఅంతస్తులో మంత్రశాల (రాజుగారి కౌన్సిల్ ఛాంబర్)లో రాజు తన మంత్రులతో మంతనాలు జరిపేవాడని తెలుస్తోంది. చెక్కలపై చెక్కబడిన సుందరమైన డిజైన్లు, చక్కటి గాలి, వెలుతురులతో ఈ గది ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తుంది. ఈ గదికి ఆనుకుని ఉన్న 'ఉత్తుపుర' లేదా డైనింగ్ హాల్ రెండంతస్తులతో 200 మంది ఒకేసారి భోజనాలు చేసే వసతితో నిర్మించబడింది. ఈ గదిలో ఊరగాయ భద్రపరచుకునే పెద్ద 15 చైనా జాడీలను చూడవచ్చు.

### కుడ్యచిత్రకళా నైపుణ్యం...

మూడు, నాలుగు అంతస్తులు అద్భుతమైన కుడ్యచిత్రాలతో చూపరుల మనసును దోచుకుంటాయి. ఇవి 17, 18వ శతాబ్దంనాటి కుడ్యచిత్రకళా నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. ఇందులో శైవ, వైష్ణవ పురాణాలకు చెందిన కథలను అందంగా చిత్రీకరించారు. రామాయణం, మహాభారత గాథలు కూడా అర్థమయ్యే తీరులో చిత్రీకరించడం చిత్రకారుల నైపుణ్యానికి నిదర్శనం. దీనిపై అంతస్తులో ఉన్న గదిని పద్మనాభ స్వామి గదిగా భావించబడుతోంది. స్వామివారు శయనించేందుకు చెక్కమంచం ఏర్పాటు చేశారు. ఉప్పిరిక్కమాలిగలో ఊయల మంచాలు, విదేశీ అద్దాలు, చైనా జాడీలు, ఇత్తడి దీపాలు మొదలైన వస్తువులను దర్శించవచ్చు.

### విజయనగర శిల్పశైలిలో...

అంతఃపురం లేదా స్త్రీల భవనం ఆకర్షణీయమైన కుడ్యచిత్రాలతో అందాలు ఒలకబోస్తుంది.

### తమిళనాడులో ఉన్నా.. కేరళ ప్రభుత్వం నిర్వహణ

క్రీ.శ. 1729-1758 మధ్య ట్రావెన్‌కోర్‌ని పరిపాలించిన మహారాజా మార్తాండవర్మ పాలన ప్రారంభంలో ట్రావెన్‌కోర్‌లో అంతర్యుద్ధం జరుగుతుండేది. దాన్ని అణిచివేసి రాజ్యాన్ని విస్తరించుకుని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేందుకు ఆయన ఎంతో కృషి చేశాడు. రాజ్యం సుసంపన్నం అయిన పిదప దేవాలయాల నిర్మాణానికి, ప్యాలెస్‌లు, కోటల నిర్మాణానికి, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలపై దృష్టి సారించాడు. అంతకుమునుపు మట్టిలో నిర్మించిన 'కల్కుళం' ప్యాలెస్‌ని కూల్చివేసి మార్తాండవర్మ గ్రానైట్‌తో పునర్నిర్మించాడు. రాజా మార్తాండవర్మ తన కులదైవమైన శ్రీపద్మనాభుడికి తన రాజ్యాన్ని అంకితం చేశాడు. తాను పద్మనాభ దాసుడిగా రాజ్యపాలన చేశాడు. అందుకే 'కల్కుళం' కోట, ప్యాలెస్‌కి పద్మనాభపురం కోట, పద్మనాభపురం ప్యాలెస్ అని పేర్లు వచ్చాయి. పద్మనాభపురం ప్యాలెస్ అనేక భవనాల సముదాయం. ప్రారంభ దశలో చాలా చిన్నదిగా ఉన్న ఈ ప్యాలెస్.. 18వ శతాబ్దం చివరిలో ఎన్నో భవనాలతో ప్యాలెస్‌గా రూపొందింది. బాహ్యరూపం సాధారణంగా ఉన్నా, లోపల చెక్క కట్టడాలు, కుడ్యచిత్రాలతో అలరిస్తుంది. ఈ ప్యాలెస్ తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారి జిల్లా తుక్కలైకి సమీపంలోని పద్మనాభపురంలో ఉంది. కానీ ప్యాలెస్ నిర్వహణ మాత్రం కేరళ రాష్ట్రప్రభుత్వం ఆధీనంలో ఉంది. 1935వ సంవత్సరంలో ట్రావెన్‌కోర్ రాజ కుటుంబీకుల మద్దతుతో ఈ ప్యాలెస్‌ని మ్యూజియంగా మార్చారు. తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు రెండూ ప్యాలెస్ బాధ్యతలు నిర్వహిస్తున్నా... కార్యనిర్వాహణ అధికారం మాత్రం కేరళ ప్రభుత్వం చేతిలో ఉంది.

### కీలకం 'ఉప్పరిక్కమాళిగై'




ప్యాలెస్ సముదాయంలో అత్యంత ప్రాచీనమైనది 'థాయ్ కొట్టారమ్' లేదా మదర్ ప్యాలెస్. దీన్ని వేనాడును పాలించిన రవి వర్మ కులశేఖర పెరుమాళ్ నిర్మించినట్లు తెలుస్తుంది. ఇది నాలుగు వైపులా అందమైన గదులతో నిర్మించబడి బహిరంగ ప్రాంగణాలు కలిగి ఉంది. థాయికొట్టారమ్ ఉత్తరంవైపున 'ఏకాంతమండపం'గా పిలువబడే పూజగది కనిపిస్తుంది. దీనికి తూర్పున చిన్న 'సరస్వతి' మందిరం దర్శనమిస్తుంది. తమిళ కవి 'కంబన్' ఈ ఆలయంలోని సరస్వతి దేవిని పూజించేవాడని చరిత్ర చెబుతుంది. నవరాత్రి ఉత్సవాల సమయంలో యేటా ఈ సరస్వతిదేవి విగ్రహాన్ని ఊరేగింపుగా తిరువనంతపురం తీసుకెళ్లడం ఆనవాయితీ. థాయ్‌కొట్టారమ్' వాయవ్య దిశలో ఉండే రాజభవన సముదాయంలో అత్యంత ముఖ్యమైనది 'ఉప్పరిక్కమాళిగై'. ఈ సముదాయాన్ని రాజా మార్తాండవర్మ నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ భవనం కింది అంతస్తులో రాజావారి 'ఖజానా' ఉన్నది. ఈ ఖజానా పైన రాజుగారి పడకగది ఉంది. ఈ గదిలో రకరకాల మూలికలు, ఔషధ కలపతో చేయబడిన అరుదైన మంచం అపురూపమైన పనితనానికి నిదర్శనంగా కనిపిస్తుంది. ఇది డచ్ వ్యాపారుల బహుమతిగా తెలుస్తోంది.



గ్రానైట్ మంచం - ప్యాలెస్‌లోని క్లాక్ టవర్







నాటి రాజులు ఉపయోగించిన జాడీలు

విదేశీ అతిథుల కోసం ఉపయోగించే భవనం 'ఇంద్రవిలాసం' ప్యాలెస్. 'నవరాత్రి మండపం' గ్రానైట్‌తో నిర్మించబడిన నిర్మాణం. దీనిని సంగీత, నృత్య కార్యక్రమాలకు ఉపయోగించేవారు.విజయనగర శిల్పశైలిలో ఈ మండపం నిర్మించబడింది. దక్షిణ ప్యాలెస్‌ని 'తెక్కేకొట్టారం' లేదా నిరప్పుర' అని పిలుస్తారు. ఇది ప్యాలెస్ కాంప్లెక్స్ నుంచి ఒక రోడ్డుద్వారా వేరు చేయబడింది. ఈ భవనం 1993లో వారసత్వ మ్యూజియంగా మార్చబడింది. ఇక్కడ పురాతన గృహోపకరణాలు, మరెన్నో ఆసక్తికర వస్తువులు ఆకట్టుకుంటున్నాయి. ప్యాలెస్ భవన సముదాయాల్లోనే ఆకర్షణీయమైన భవనం ఇది. ఖడ్గాలు, ఆయుధాలు మొదలైనవి ఆనాడు జరిగిన యుద్ధాలకు సాక్షీభూతంగా ఈ మ్యూజియంలో మనకు కనిపిస్తాయి. ఇక వివిధ రకాల నాణేలను కూడా ఇక్కడ చూడొచ్చు. సింధూ నాగరికతకు సంబంధించిన వివిధ రకాల వస్తువులు ఈ మ్యూజియంలో భద్రపరచబడ్డాయి. ఎంతో విలువైన సమాచారాన్ని తెలిపే రాతి, రాగి శాసనాలు ఎన్నో ఇక్కడ దర్శనమిస్తాయి. సాంఘిక దురాచారాలను నిషేధించినట్లు చేసిన రాతి శాసనాలు కూడా ఈ మ్యూజియంలో కనిపిస్తాయి. అంతర్జాతీయంగా ఖ్యాతిపొందిన ఈ పద్మనాభపురం ప్యాలెస్ పురాతన కేరళ శిల్ప, చిత్రకళా శైలికి అద్దం పడుతోంది. ప్రతినిత్యం ఎందరో దేశ, విదేశ యాత్రికులు ఈ ప్యాలెస్‌ని సందర్శిస్తుంటారు. ఇక ఆలస్యమెందుకు? 'పద్మనాభపురం ప్యాలెస్'ను వెంటనే చూసొద్దాం రండి.



ప్యాలెస్ లోపలి భాగం

---

## రాజ్ అయ్యప్ప హీరోగా చిత్రం



కొత్త చిత్రం పూజా దృశ్యం

నటుడు రాజ్ అయ్యప్పన్ హీరోగా డెబ్యూ డైరెక్టర్ రాజన్ రవి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనుంది. 'ప్రొడక్షన్ నెం.1' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందే ఈ చిత్రాన్ని మిస్టర్ పిక్చర్స్ స్టూడియోస్, కాంతారా స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శ్రీధారావు హీరోయిన్. ప్రేమ్‌జీ, శ్రీనాథ్, సౌందర్య శరవణన్, సిబి జయకుమార్ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం తాజాగా పూజతో ప్రారంభమైంది. మూవీకి కెమెరా కిరణ్ కుమార్, మ్యూజిక్ బాలసుబ్రమణియన్, ఎడిటింగ్ రిచర్డ్‌సన్, ఆర్ట్ డైరెక్టర్ లక్ష్మణన్ గోపి, కాస్ట్యూమ్ డిజైనర్ డీనా రొసారియో, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విక్కీ, నిర్మాత ఆర్.జయలక్ష్మి.

## యువ సంగీత కళాకారుల కోసం 'చీర్స్ మ్యూజిక్'



'చీర్స్ మ్యూజిక్'లో ఆరి అర్జునన్ తదితరులు

కొత్త, వర్ధమాన సంగీత కళాకారుల కలలు నిజం చేసేందుకు 'చీర్స్ మ్యూజిక్' అనే కంపెనీని ప్రారంభించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ మ్యూజిక్ కంపెనీ రూపొందించిన తొలి ఆల్బమ్ సాంగ్‌ను విడుదల చేశారు. బుల్లితెరపై అనేక వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్న చీర్స్ మ్యూజిక్ తొలిసారి ఈ తరహా మ్యూజిక్ ఆల్బమ్‌ను రూపొందించింది. ఇది ఇండో - కొరియన్ బాణీలో సాగుతుంది. ఈ మ్యూజిక్ కంపెనీ ప్రారంభోత్సవం సందర్భంగా వ్యవస్థాపకుడు అభిలషా మాట్లాడుతూ... 'వర్ధమాన, కొత్త సంగీత కళాకారుల కలలు నిజం చేయాలన్న ప్రధాన ఉద్దేశంతో ఈ కంపెనీని ప్రారంభించాం. ఈ కంపెనీ ద్వారా అనేక మంది కొత్త సంగీత కళాకారులు, గాయకులు, గీత రచయితలను సంగీత ప్రపంచానికి పరిచయం చేయనున్నాం. కేవలం తమిళంలోనే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులందరూ ఎంజాయ్ చేసేలా ఒక ఆల్బమ్‌ను రూపొందించాలని భావిస్తున్నాం. తాజాగా రూపొందించిన తొలి ఆల్బమ్‌కు తరుణ్ సంగీతం అందించారు. దేశంలోని అత్యుత్తమ సినిమాటోగ్రాఫర్లలో ఒకరిగా ఉన్న రవివర్మన్ ఛాయాగ్రహణం సమకూర్చారు. నటుడు ఆరి అర్జునన్ తొలిసారి ఈ ఆల్బమ్‌లో నటించారు. సౌత్ కొరియాకు చెందిన నటి ఆరా ఈ ఆల్బమ్ కోసం పనిచేశారు. భాష, సంస్కృతి, దేశాల సరిహద్దులతో సంబంధం లేకుండా యావత్ ప్రపంచంలోని ప్రజలకు ఒక వారధిలాంటిది సంగీతం' అని పేర్కొన్నారు.

## హీరోగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు

చిత్రజ్యోతి



అభిషన్ జీవింత్ - అనస్వర రాజన్

'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్ర దర్శకుడు అభిషన్ జీవింత్ హీరోగా పరిచయమవుతున్నారు. ఆయన నటించే చిత్రాన్ని ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్మెంట్ నిర్మించనుంది. స్వాన్ ఫిలిమ్స్ పతాకంపై సౌందర్య రజనీకాంత్ సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ఇందులో అభిషన్ జీవింత్ సరసన అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించనుండగా, షాన్ రోల్డన్ సంగీతం సమకూర్చనున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమం తాజాగా చెన్నైలో జరిగింది. ఇందులో నటులు శశికుమార్, ఆర్‌జే బాలాజీ, మణికంఠన్, నటి సిమ్రాన్, దర్శకుడు రంజిన్ జయకొడి, ప్రభురాం వ్యాస్, డీడీ తదితరులు పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు. నేటి జనరేషన్‌ను ఆకట్టుకునేలా ప్రేమ కథా చిత్రంగా ఈ మూవీని తెరకెక్కించనున్నారు. 'లవర్, 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రాలకు సహాయ దర్శకుడుగా పనిచేసిన మదన్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రంలో నటించే ఇతర నటీనటులు, పనిచేసే టెక్నీషియన్ల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

## 50 మంది హీరోయిన్లు నిరాకరించారు



● కేపీవై బాలా

కథ నచ్చినప్పటికీ తనతో నటించేందుకు 50 మంది హీరోయిన్లు నిరాకరించారని నటుడు కేపీవై బాలా అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'గాంధీ కన్నాడి'. ఈ చిత్ర వివరాలను చెన్నైలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇందులో కేపీవై బాలా మాట్లాడుతూ... 'ఈ సినిమా కోసం హీరోయిన్ల ఎంపిక ఓ ప్రహసనంలా సాగింది. హాలులో కథను శ్రద్ధగా విన్న హీరోయిన్లు, ఆ తర్వాత హీరో ఎవరు అని అడుగుతారు. దర్శకుడు నా పేరు చెప్పగానే మళ్లీ చెపుతామంటూ వెళ్లిపోతారు. అలా 50 మంది హీరోయిన్లు ఈ కథ విని నేను హీరో అని తెలియగానే నాతో నటించేందుకు నిరాకరించారు. 51వ హీరోయిన్‌గా నమిత కృష్ణమూర్తి ఎంపికయ్యారు. కథ వినగానే ఎలాంటి మరో ఆలోచన లేకుండా సమ్మతించారు' అని పేర్కొన్నారు. కాగా, సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పనులను పూర్తి చేయగా, సెప్టెంబరు 5న విడుదల చేయనున్నారు. ఆదిమూలం క్రియేషన్స్ పతాకంపై నిర్మాత జయకిరణ్ నిర్మించారు. 'రణం' ఫేం షెరీఫ్ దర్శకుడు. ఇందులో దర్శకుడు బాలాజీ శక్తివేల్, అర్చన తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. వివేక్ - మెర్విన్ ద్వయం సంగీతం సమకూర్చింది.

---

## సిప్‌కాట్‌లో ఏసీ ప్లాంట్‌కు విఘ్నేష్ పాలిమర్స్ శంకుస్థాపన



ఏసీ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరు తాలూకాలోని సిప్‌కాట్ పారిశ్రామికవాడలో విఘ్నేష్ పాలిమర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తన ఎయిర్‌కండీషనింగ్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. ఈ కంపెనీ నిర్మించే పదో ప్లాంట్ కావడం గమనార్హం. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి సీపీఏజీ డివిజన్ గ్రూపు ప్రెసిడెంట్ మోహిత్ సుద్, పీ అండ్ ఎస్‌సీఎం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ నిధియానంద్, కంపెనీ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ సి.హరిదాస్, పీ అండ్ ఎస్‌సీఎం వైస్ ప్రెసిడెంట్ మునిష్ మల్హోత్రా, పీ అండ్ ఎస్‌సీఎం జీఎం సుధీర్, ప్రొక్యూర్‌మెంట్ హెడ్ నవీన్ కుమార్, పీ అండ్ ఎస్‌సీఎం మేనేజర్ శరవణ కుమార్ ముత్తు, యూనియర్ బ్యాంకు ఆఫ్ ఇండియా (చెన్నై) జోనల్ హెడ్ సత్యబన్ బెహెరా తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా 'విన్-ఐకాన్ 205' సదస్సు




అడయార్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి చాప్టర్ ఆఫ్ ఉమెన్స్ ఇన్ నెఫ్రాలజీ ఇండియా (విన్-ఇండియా) తన నాలుగో వార్షికోత్సవ సదస్సును నగరంలో విజయవంతంగా నిర్వహించింది. 'ప్రభావవంతమైన సహకారంతో అధునాతన, ఆధారాల ఆధారిత నెఫ్రాలజీని అభ్యసించడం' అనే థీంతో ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించగా, దాదాపు 300 మందికి పైగా నెఫ్రాలజిస్టులు హాజరయ్యారు. ఈ సదస్సును ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్ సెంటిస్ట్, ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ప్రారంభించగా, ఇండియన్ సొసైటీ ఇన్ నెఫ్రాలజీ సెక్రటరీ డాక్టర్ శ్యామ్ బన్సల్, ఐఎస్‌ఓటీ ప్రెసిడెంట్ డాక్టర్ అర్పిత రే, కిడ్నీ వారియర్స్ ఫౌండర్ వసుంధర రాఘవన్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో నెఫ్రాలజిస్టులు, పరిశోధకులు, విద్యావేత్తలు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు పాల్గొన్నారు.

## పూడికతీత పనుల పరిశీలన



కొడుంగైయూర్‌లో కాలువ పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు నెహ్రూ, శేఖర్‌బాబు

చెన్నై,ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):స్థానిక తిరువిక నగర్ మండల పరిధిలోని ఒట్టేరి కాలువలో రూ.65 కోట్లతో చేపట్టిన పూడికతీత పనులను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శనివారం పరిశీలించారు. అనంతరం తండయార్‌పేట మండలం వ్యాసర్పాడి కెప్టెన్ కాలువలో రూ.6.85 కోట్లతో చేపట్టిన పూడికతీత పనులు పరిశీలించిన డిప్యూటీ సీఎం, కొడుంగైయూర్ కాలువలో పూడికతీత పనులను ప్రారంభించారు. మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాస్వామి, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు ఆర్డీ శేఖర్, తాయగం రవి, సుదర్శనం, శంకర్, మండల కమిటీ అధ్యక్షులు సరిత మహేష్‌కుమార్, నేతాజీ గణేశన్, ఏవీ ఆర్ముగం, కౌన్సిలర్లు ఢిల్లీ బాబు, రాజేంద్రన్, కాశినాథన్, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుబరన్ తదితరులున్నారు.

## రాష్ట్రంలో 12,152 ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు పూర్తి

● మంత్రి పీకే.శేఖర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి పీ.కే.శేఖర్‌బాబు

ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 12యేళ్ల అనంతరం మహాకుంభాభిషేకం నిర్వహించదలచిన 12,152 ఆలయాల్లో రూ.6,980 కోట్లతో జీర్ణోద్ధారణ పనులు పూర్తి చేసినట్లు రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఎగ్మూర్‌లోని చెన్నై మెట్రోపాలిటన్ డెవలెప్మెంట్ అథారిటీ (సీఎండీఏ) కార్యాలయంలో శనివారం పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం మంత్రి ఆ వివరాలను మీడియాకు వివరించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో 3,503 ఆలయాలకు మహాకుంభాభిషేకోత్సవాల్ని విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. రానున్న జనవరిలోగా 4వేల ఆలయాల్లో కుంభాభిషేకం నిర్వహించేలా జీర్ణోద్ధరణ పనులను ముమ్మరం చేశామన్నారు. ఇప్పటివరకు 12,152 ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.1,470.21 కోట్లను దాతలు విరాళంగా అందజేశారని తెలిపారు. 1000యేళ్లు దాటిన 714 పురాతన ఆలయాలను గుర్తించి వాటిలో 68 ఆలయాల్లో కుంభాభిషేకం పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 1న ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల మహానాడు జరుగుతుందని మంత్రి తెలిపారు.ఈ మహానాడులో భట్టాచార్యులు, శివాచార్యులు, అర్చకులు, పూజారులు, పరిచారకులు, ఆలయ సిబ్బంది పాల్గొంటారని మహానాడును పురుషవాక్కంలోని కానీ, ఎగ్మూర్‌లో కానీ నిర్వహించేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.



కీర్తనలు ఆలపిస్తున్న బొమ్మిశెట్టి రఘునాథ్ బృందం

## అలరించిన తెలుగు వాగ్గేయకారుల సంగీత వైభవం

ప్యారీస్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తెలుగు వాగ్గేయకారుల సంగీత వైభవం ఆద్యంతం అలరించింది. వేదిక ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. స్థానిక టి.నగర్‌లోని శ్రీ ఆర్‌కేఎం శారదా విద్యాలయం హాలు వేదికగా శనివారం సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు బొమ్మిశెట్టి రఘునాథ్, పి.రమణవాణి బృందం ప్రముఖ వాగ్గేయకారులు అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు కీర్తనలు ఆలపించి శ్రోతలను మైమరపింపజేశారు. అరుణాశ్రీనాథ్ ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో డబ్ల్యూటీఎఫ్ అధ్యక్షురాలు డాక్టర్ వి.ఇందిరా దత్ అధ్యక్షోపన్యాస సందేశాన్ని అందించారు. సమాఖ్య కార్యదర్శి, సి.లక్ష్మీమోహన్‌రావు ఆహ్వానం పలికి అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమంలో కళాకారులు బొమ్మిశెట్టి రఘునాథ్‌కి గాత్ర సహకారాన్ని పి.రమణవాణి, వయోలిన్‌పై చక్రపాణి, మృదంగంపై వన్నూరు స్వామి సహకారం అందించారు. ముందుగా సమాఖ్య కమిటీ సభ్యుడు గోటేటి వెంకటేశ్వరరావు, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తిని స్మరించుకుంటూ ప్రత్యేక ఉపన్యాసాన్ని అందించారు. సభ్యులు జే.ఎం.నాయుడు, రుక్మిణిదేవి, తాతినేని జయశ్రీ, సురేఖ మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం కోశాధికారి ఎం.వెంకటసుబ్బారావు వందన సమర్పణతో ముగిసింది.



హాజరైన తెలుగువారు







తిరుపతిలోని ఎమ్మార్‌పల్లె : తులాభారం వినాయకుడు - వేషాలమ్మ ఆలయం వద్ద : ఐదు తలల పాముపై.. - అరవపల్లెవీధి : పండ్ల చెట్టుపై ఊగుతున్న వినాయకుడు - నిమ్మకాయల వీధి : బ్రహ్మ రూపంలో.. - పరసాలవీధి : నంది వాహనంపై..



## 'కిక్' ఇవ్వని దరఖాస్తులు

● జిల్లాలో ఆరు బార్లకు నిల్

● ముగిసిన లైసెన్స్‌ల లాటరీ ప్రక్రియ


బార్లకు లాటరీ తీస్తున్న కలెక్టర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన బార్ల లైసెన్స్ లాటరీ విధానం పారదర్శకంగా ముగిసింది. తిరుపతి మినహా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఆశించిన మేర దరఖాస్తులు రాలేదు. దరఖాస్తుల గడువు పొడిగించినా సరైన స్పందన లేదు. ఈ ప్రభావం ఎక్సయిజ్ ఆదాయంపై పడుతుందని భావిస్తున్నారు. కాగా కలెక్టర్ వెంకటేశ్వర్ లాటరీ తీసి, దరఖాస్తుదారులకు లైసెన్స్‌లు కేటాయించారు. మొత్తం 29 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా 23కు మాత్రమే దరఖాస్తులు అందాయి. ఇందులో తిరుపతి నగరంలో అత్యధికంగా 17 బార్లకు గాను 149 దరఖాస్తులు వచ్చాయి. పరిశీలించిన అధికారులు అత్యధికంగా టెండర్ కోడ్ చేసిన 17 మందికి లాటరీ పద్ధతిలో కేటాయిస్తూ లైసెన్సులు జారీ చేశారు. చంద్రగిరి, పుత్తూరులో రెండు బార్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని ఒక బార్‌కు దరఖాస్తులు అందలేదు. నాయుడుపేట పరిధిలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు అందాయి. గూడూరు పరిధిలో మూడు బార్లకు గాను ఒక దానికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. సూళ్లూరుపేటలో రెండు బార్లు, వెంకటగిరిలో ఒక బార్‌కు దరఖాస్తులు అందలేదు. మొత్తంగా 23 బార్లకు దరఖాస్తులు అందగా ఒక్కో దరఖాస్తు రుసుం రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.10వేలు చెల్లించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.8.82 కోట్లు ఆదాయం వచ్చింది. ఇక రిజర్వేషన్ కేటగిరీ కింద గీత కార్మికుల కోసం కేటాయించిన తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరు పరిధిలో మూడు బార్లకు గాను 36 దరఖాస్తులు అందాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.1.83 కోట్లు ఆదాయం లభించింది. దీంతోపాటు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో అదనంగా మరో రూ 2.30 కోట్లు ఖజానాకు ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, ఏసీ శ్రీనివాసులు, ఏఈఎస్ వాసుదేవ చౌదరి పాల్గొన్నారు.


### టీటీడీ చైర్మన్‌తో నటుడు సాయికుమార్ భేటీ




తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): సినీనటుడు సాయికుమార్ శనివారం టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి దర్శనార్థం ఆయన కుమారుడు ఆదితో కలిసి తిరుమలకు వచ్చారు. సాయంత్రం చైర్మన్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ నాయుడిని కలిసి వివిధ అంశాలపై ముచ్చటించారు.

## వానాకాలం జ్వరాలతో జాగ్రత్త!

ఇంటర్వ్యూ



తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



అడపాదడపా ఆగకుండా కురుస్తున్న వానలు జ్వరాలను వ్యాప్తి చేస్తున్నాయి. వానలకు చెట్టూచేమా పెరిగి పరిసరాలు గుబురుగా మారుతున్నాయి. చిన్న గుంటల్లోనూ నీరు చేరి దోమలు వ్యాపిస్తున్నాయి. సీజనల్‌గా వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటివి పెరుగుతున్నాయి. జలుబు, దగ్గు, తలనొప్పితో ఇబ్బంది పడేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నిరోధానికి ప్రభుత్వ సన్నద్ధత గురించి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ ఆంధ్రజ్యోతి సంభాషణ...

జిల్లా వైద్యాధికారి అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్



**ప్రశ్న :** ఈ వర్షాకాలంలో వ్యాధుల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

**జవాబు :** నీరు నిలిచే, దోమలు ఉండే ప్రదేశాలను గుర్తించాం. శుభ్రం చేయిస్తున్నాం. తాగునీటి బావులు, బోర్లు, కుళాయిల వద్ద క్లోరినేషన్ చేయిస్తున్నాం. ఎక్కడైనా ఒకటి రెండు జ్వరం కేసులు రాగానే వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నాం. పరిసరాల శుభ్రత, దోమల విజృంభణపై గ్రామాల్లో సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

**ప్రశ్న:** మందులకు, నిధులకు, వైద్యులు, ఇతర సిబ్బందికి కొరత ఉందా?

**జవాబు :** సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా అవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసే రూ.1.75 లక్షలతో మందులు కొనుగోలు చేసుకునే వెసులుబాటు పీహెచ్‌సీలకు కల్పించాం. మరీ ఇబ్బంది ఉంటే జిల్లా కార్యాలయంలోని ఎపిడమిక్ విభాగమే వైద్యశిబిరాలను నిర్వహిస్తుంది. వైద్యుల, సిబ్బంది కొరత లేదు.

**ప్రశ్న:** ఎలాంటి వైద్య సేవలను అందిస్తున్నారు?

**జవాబు :** జిల్లాలో 26 యూపీహెచ్‌సీలు, 58 పీహెచ్‌సీల పరిధిలో దాదాపు 70కి పైగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. 160కి పైగా రకాల మందులను ఉచితంగా అందిస్తున్నాం. గ్రామీణ పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్యసేవలందించేలా అప్రమత్తం చేశాం. సీజనల్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు, వైద్య సేవలు ఇక్కడే అందేలా చర్యలు తీసుకున్నాం. అత్యవసరమైతే ప్రాంతీయ, ఏరియా ఆస్పత్రులకు లేదా రుయాస్పత్రికి బాధితులను తీసుకువచ్చి వైద్యం అందిస్తునాం.

**ప్రశ్న:** పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక చర్యలు?

**జవాబు:** వర్షాకాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడే ది పిల్లలు, వృద్ధులూ. వీరి ఆరోగ్య భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. వైద్యారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శిస్తున్నారు. జలుబు, దగ్గు వంటి చిన్నపాటి లక్షణాలున్నా వైద్య సహాయం అందిస్తున్నారు. ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని, చలిని తట్టుకునే దుస్తులను ధరించాలని సూచిస్తున్నాం వృద్ధులు మరీ అవసరమైతే తప్ప ఈ సీజన్‌లో బయటకు రాకపోవడం మంచిది.

**ప్రశ్న :** ప్రజలకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

**జవాబు :** వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చేస్తాయి. దోమ తెరలు వాడాలి. దోమల నివారణకు మార్కెట్లలో అమ్మే రసాయనాలతో మరింత జబ్బుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవడమే శ్రేయస్కరం. చిన్నారులు, వృద్ధులు, ఆస్తమా వంటి బాధితులు చిన్నపాటి అనారోగ్యలక్షణాలున్నా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించాలి.

### సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**గురువారం హుండీ ఆదాయం : రూ.3.39 కోట్లు**

**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,717**

**తలనీలాలు సమర్పించినవారు: 22,445**

### శ్రీవారిని దర్శించుకున్న బుద్ధ సర్క్యూట్ యాత్ర సభ్యులు



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని 'త్రిసేనల బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర' సభ్యులు శనివారం దర్శించుకున్నారు. బుద్ధుడి సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వాలను దేశమంతా వ్యాప్తిచేయాలనే లక్ష్యంతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రిసేనల అధికారులు, బిమ్‌స్టెక్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో కూడిన బృందం మోటరు సైకిల్ యాత్రగా శుక్రవారం తిరుపతికి చేరుకున్న విషయం తెలిసిందే. వీరి బృందం శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

### పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై వినతులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై రాజకీయ పార్టీల నేతలతో కలెక్టరేట్‌లో శనివారం డీఆర్వో నరసింహులు సమావేశమయ్యారు. చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయని, ఓటర్లు ఎక్కువగా ఉన్న కేంద్రాలను సర్దుబాటు చేయాలని టీడీపీ మహిళా నాయకురాలు సుధారెడ్డి కోరారు. ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లకు సంబంధించిన వివిధ సమస్యలను డీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నేతలు వరప్రసాద్, నాగార్జున, కలిందర్, చంద్రమోహన్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### గూడూరు, శ్రీకాళహస్తి ఆస్పత్రులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టుల నియామకం

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గూడూరు, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టులు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా కోవూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (జనరల్ సర్జరీ)గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.వెకంటాచలపతి సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతిపై గూడూరు ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. అలాగే గూడూరు ఏరియా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (పీడియాట్రిక్స్)గా పనిచేస్తున్న డాక్టర్ బి.గిరిజ సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతిపై శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## వేనాడు దర్గాలో గంధోత్సవం ప్రారంభం


దర్గాలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

● పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం

తడ/సూళ్లూరుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతిగాంచిన వేనాడు షేక్ దావూద్ షా వలీ అల్లాతాత దర్గా గంధోత్సవం శనివారం అట్టహాసంగా మొదలైంది. 630 ఏళ్ల చరిత్ర కలిగి 144 అడుగుల పొడవు కలిగిన వేనాడు దర్గా గంధోత్సవానికి నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు. మన ప్రాంతం నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పలువురు టీడీపీ నాయకులు గంధోత్సవ ప్రారంభంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేకు దర్గా నిర్వాహకులు సుదర్శన్ రావు, మజార్లు స్వాగతం పలికి, ఆశీర్వచనం చేశారు. దర్గా ప్రాంగణమంతా విద్యుద్దీప కాంతులతో విరాజిల్లింది. ఉర్దూ ఖవ్వాలి, ఫకీర్ల విన్యాసాల నడుమ తరలివచ్చిన భక్తులు బాబా ఆశీస్సులు పొందారు. దర్గా ఆవరణలో సీసీ కెమెరాలతో పాటు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటల వరకు భక్తులతో దర్గా ప్రాంగణమంతా కిటకిటలాడింది. అర్ధరాత్రి దాటాక గ్రామ పొలిమేరలో ఉన్న పీర్లచావడి వద్ద ముస్లిం మతపెద్దలు ప్రత్యేక పూజలు చేసి, గంధాన్ని గుమటంపై గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం గంధాన్ని గ్రామ నిర్వాహకుల చేతుల మీదుగా తీసుకెళ్లి దర్గా సమాధి వద్ద లేపనం చేసినానంతరం భక్తులకు పంచిపెడతారు. గంధోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సూళ్లూరుపేట ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో 10మంది ఎస్‌ఐలు, ఇద్దరు సీఐలు, 120 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చూశారు.


విద్యుత్ వెలుగుల్లో దర్గా ప్రాంగణం

### మెడికల్ అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

**తిరుపతి నుంచీ ఇద్దరికి బదిలీ... ఇక్కడికి ముగ్గురి రాక**

తిరుపతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ మెకడికల్ కళాశాలల్లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురికి ప్రభుత్వం ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించింది. అందులో భాగంగా తిరుపతి ఎస్వీ ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచీ ఇద్దరు పదోన్నతిపై ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా ఇతర ప్రాంతాల నుంచీ ముగ్గురు ఈ కళాశాలకు బదిలీపై రానున్నారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో అనస్థీషియా విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.విజయ్ ప్రొఫెసర్‌గా పదోన్నతిపై నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, ఈఎన్‌టీ విభాగంలో అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ఆర్ రాజేశ్వరి పదోన్నతిపై పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు. అలాగే శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఈఎన్‌టీ విభాగం అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రమేష్ చంద్ర, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జనరల్ మెడిసిన్ విభాగం అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్కే షర్మిల, అక్కడే సైకియాట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.పద్మావతి పదోన్నతిపై ప్రొఫెసర్లుగా తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### అధునాతన పద్ధతులతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స

● బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్



తిరుపతి(వైద్యం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స అవసరమవుతోందని,ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా ఎలాంటి భయాందోళన లేకుండా చేసుకోవచ్చునని బర్డ్ డైరెక్టర్ గుడారు జగదీష్ అన్నారు. పుదుచ్చేరిలోని మహాత్మా గాంధీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ఆర్థోపెడిక్ అసోసియేషన్ 24వ వార్షిక సమావేశానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 21 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారిలోనూ మోకాలి కీళ్ల సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఆర్థోపెడిక్ రంగంలో వచ్చిన అధునాతన వైద్య పద్ధతులతో భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందీ లేకుండా మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు చేయవచ్చన్నారు. ఇటువంటి శస్త్ర చికిత్సలు విజయవంతం కావడంలో వైద్యుడి నైపుణ్యం, ఆపరేషన్ సమయంలో తీసుకునే జాగ్రత్తలు, నాణ్యమైన ఇంప్లాంట్లు ఎంపిక చేసుకోవడం ప్రధానమన్నారు. అనంతరం ఆయన ఆర్థోపెడిక్ రంగంలో తాజా ఆవిష్కరణలు, నూతన చికిత్స పద్ధతులు, అధునాతన శస్త్ర చికిత్సా సాంకేతికత గురించి వివరించారు. యువ వైద్యులకు ఆయన అనుభవాలను, పరిశోధనలను గురించి వివరించారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్లు, పరిశోధకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

### రిటైర్మెంటు ముందు రోజు టీటీడీ అధికారి మృతి

● కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు?


మృతి చెందిన సుబ్బరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి కోనేటి సుబ్బరాజు(62) ఉద్యోగ విరమణకు ఒక రోజు ముందు (శనివారం) మృతిచెందారు. ఆయన సతీమణి వెంకటసరస్వతి, అలిపిరి సీఐ రాంకిశోర్‌ల కథనం మేరకు.. తిరుపతి కేటీ రోడ్డులోని కేటీ క్వార్టర్సులో ఉంటున్న సుబ్బరాజు కపిలతీర్థం ఆలయంలో ఏఈవోగా పనిచేస్తున్నారు. ఆయన ఆదివారం రిటైర్ కావాల్సి ఉంది. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు సునీల్‌కుమార్ టీటీడీలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సుబ్బరాజు కుటుంబ సభ్యులతో కలసి సినిమాకు వెళ్లారు. అక్కడ తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఆయనను స్విమ్స్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వెంటనే కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదు. భార్య వెంకట సరస్వతి శనివారం ఉదయం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్‌ఐ అజిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ చెప్పారు. కాగా ఈ కేసులో కొంతమంది కుటుంబ సభ్యులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఆయన మృతి వెనుక మరేదైనా కోణం ఉందా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. మృతుడి మెడపై గాయం ఉన్నట్లు పోలీసులు చెప్పినట్లు సమాచారం.

### పీఏసీ5లో 2,500 మందికి వసతి

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5(పీఏసీ) ద్వారా 2,500 మంది భక్తులకు బస కల్పించవచ్చని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన శనివారం పీఏసీ5 భవనంలోని హాళ్లు, కల్యాణకట్ట, మరుగుదొడ్లు, అన్నప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బోర్డు ఆమోదం తెలిపిన ఈ ప్రాజెక్ట్ ద్వారా తిరుమలలో యాత్రికుల వసతి సమస్యకు కొంతమేర ఉపశమనం కలుగుతుందన్నారు. ప్రస్తుతం తిరుమలలో 45 వేల మందికి మాత్రమే వసతి సౌకర్యాలు ఉన్నాయని, ఈ భవనం ద్వారా 2,500 మందికి అదనంగా బస లభిస్తుందని అన్నారు. వెంకయ్య చౌదరి మాట్లాడుతూ యాత్రికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ భవనంలో ఆధునిక సదుపాయాలు కల్పించామన్నారు. చంటి పిల్లల తల్లుల కోసం ప్రత్యేకంగా మిల్క్ ఫీడింగ్ గది ఏర్పాటు చేశామన్నారు. ఒకేసారి 1400 మంది అన్నప్రసాదాలు స్వీకరించేలా హాలును ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో రాజేంద్ర పాల్గొన్నారు.

### భవనం పైనుంచి పడి బెంగాల్ కార్మికుడి మృతి


మృతి చెందిన కార్మికుడు

రేణిగుంట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భవనంపై నుంచి కిందపడి పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని విప్పమానుపట్టెడ గ్రామంలో చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. విప్పమానుపట్టెడ గ్రామంలో ఓ ప్రైవేట్ కళాశాల భవనం నిర్మిస్తోంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బిలాస్‌పూర్ గ్రామానికి చెందిన అన్సార్ రెహమాన్ బేల్దారి పని చేస్తూ కాలుజారి భవనం నుంచి కిందిపడిపోయాడు.అక్కడున్న సిబ్బంది చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కార్మికుడు మృతిచెందిన భవనాన్ని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి,రాధాకృష్ణ పరిశీలించారు.భవన యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారంతోపాటు మృతదేహాన్ని సొంత ఊరికి పంపించేందుకు ఖర్చులు భరించేందుకు అంగీకరింపజేశారు.